తెలుగు కళాసమితి (న్యూజెర్సీ)వారి 1986 మినీ కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ

# స్వతంత్ర దేశంలో ఓ అస్వతంత్ర పౌరుడు

ఈ దేశంలోవున్న యాభై కోట్ల మంది మనుషుల్లో అతనొకడు. ఎలక్షన్ సమయంలోనే అతని పేరు కొందరికైనా తెలుస్తుంది. మిగిలినప్పుడు, పేరున్న వూళ్లో పుట్టిన పేరులేని మనిషతను!

అతని చిన్నతనం ఎట్లాగడిచిందో అతనికే సరిగా జ్ఞాపకం లేదు. ఎప్పుడో, రెండో ప్రపంచ యుద్ధం మొదలు కాకముందు పుట్టిన— ముసలి మనిషి. పోనీ యౌవనం గురించి జ్ఞాపకం పెట్టుకుందామన్నా, గులా బీల మంటలేవీ గుండెలో రగలడం లేదు. తల్లి జోలపాటా గుర్తు లేదు. ప్రియురాలి వలపు పాటా జ్ఞప్తి లేదు. అంతా ఓ ఎడారి.

చిన్నప్పుడెప్పుడో స్కూల్లో అయ్యవారేవో నాలుగు ముక్కలు బట్టీ పట్టించిన పాత వాసన. సత్యమునే చెప్పవలయును. ధర్మమునే ఆచరింపుము. హరిశ్చంద్రుడు సత్య వాక్పరిపాలకుడు. రామచంద్రుడు ధర్మమూర్తి. ఆ మాటలు జ్ఞాపకం వస్తే నవ్వుకుంటాడు. అతను సత్యం చెబుదామని చాలాసార్లు ప్రయత్నం చేశాడు. అందరూ నవ్వారు. నవ్వని వాళ్ళు కోప్పడ్డారు. అతను ధర్మంగా బతకాలనుకున్నాడు. తగిలిన ఎదురు దెబ్బలు తలను బొప్పి కట్టించాయి. పైగా ధర్మం ఏదో, అధర్మం ఏదో స్పష్టంగా తెలీక చాలాసార్లు తికమక పడ్డాడు. తిట్లు తిన్నాడు.

కన్నతండ్రి ఓ అమ్మాయిని చూపించి, మూడుముళ్ళూ వేయమన్నాడు.




కొండముది శ్రీరామచంద్రమూర్తి

"నేను మా నాన్న చూపించిన అమ్మాయినే మారు మాట్లాడకుండా పెళ్ళి చేసుకున్నాను. నిన్ను కన్నాను. నేనవున్న అమ్మాయిని నువ్వూ చేసుకో. సుఖపడు" అన్నాడు అతని తండ్రి.

పెళ్ళయిన తర్వాత బరువు తెలిసింది కానీ, సుఖమేమిటో తెలీలేదు. గానుగెద్దు బతుకై పోయింది. కొంతకాలం తర్వాత ఆ బతుకూ కష్టమై పోయింది. ఉద్యోగం వూడిపోయింది.

అతని పెళ్ళాం అన్నది కోపంగా, "ఇంక నాకెవరు తిండిపెడతారూ? నన్నెవరు పోషిస్తారూ?"

"మా నాన్న...!"

"అంత చేతగానివాళ్ళా మీరు? పెళ్ళాన్ని పోషించుకోవడానికి తండ్రి పేరు చెబుతున్నారూ...?"

"అదేం లేదు. ఉద్యోగం వెతుక్కుంటు న్నాను కదా.. ఉద్యోగం దొరికేటంత వరకూ మనకు ఆయనే ఆధారం!"

"పోనీ కూలిపని చేయండి."

"కూలిపనా..?"

"ఏం పెళ్ళాన్ని పోషించుకోవటానికి కూలిపని చేస్తే తప్పా?"

"తప్పా... తప్పన్నరా... మా నాన్న గౌరవం మంట గలిసి పోదూ?"

"ఎంత గౌరవం వుందిట ఆయనకు?"

"ఎంతో కొంత-ఉన్నంత వుంది!"

"అయితే...?"

"ఆ కాస్తా కూడా పాడుచేయడం నాకు ఇష్టం లేదు!"

## తాలు

ఎండి బీటలు వారిన
నా ప్రజల బతుకు పొలంలో
నేడీ పాలకులు
యెన్నెన్ని వాగ్దాన వర్షాలు
కురిపిస్తేనేం...
మొలకెత్తేందుకు
చిత్తశుద్ధి విత్తనాలేవీ?

— జానీ

అతనికి ఉద్యోగం ఎక్కడా దొరకడం లేదు. వెళ్ళిన ప్రతిచోటా పోయిన ఉద్యోగం గురించే అడుగుతున్నారు. ఒకరోజు, ఇహ వుండలేక అతని భార్య అడిగింది — మళ్ళీ!

"మీరు దొంగతనం చెయ్యగలరా?"

"ఊహూ! అది పాపం! పైగా అంత ధైర్యం కూడా నాకు లేదు."

"అయితే ఇద్దరం కలసి ఇంత ఎండ్రిన్ తాగి చచ్చిపోదామా?"

"వద్దు. వద్దు. బలవంతంగా ప్రాణాలు తీసుకున్నవాళ్ళు నరకానికి పోతారు."

"అయితే నన్నెందుకసలు పెళ్ళి చేసుకున్నారూ?"

"నేను చేసుకోలేదు. మా నాన్న చేశాడు!"

అతవి భార్య నుదురు బాదుకుంది. తన కర్మ కేడ్చింది. ఇంట్లో పొయ్యిలో పిల్లి లేవక అతను చాలా రోజులు పస్తులుండవలసి వచ్చింది. బేలగా, దీనంగా, ఆకలి చూపుల్తో అతను వీధిలో నడుస్తుంటే పిల్లలు వెంటపడేవాళ్ళు.

అతను పెద్దాసుపత్రికి వెళ్ళాడు — రక్తం ఇస్తానని — కాదు అమ్ముతానని! "నీకే రక్తం కావాలి — ఇంక నువ్వేం రక్తం ఇస్తావ్—పో పో!!" అన్నారు ఆస్పత్రిలో డాక్టర్లు.

కళ్ళాసుపత్రికి వెళ్ళాడు. "బాబూ, ఓ కన్నిస్తాను. తీసుకునే దాత వుంటే చెప్పండి తండ్రులూ!" అన్నాడు దీనంగా, దయనీయంగా. "తప్పు నాయనా! బతికుండగా, కళ్ళీయకూడదు. అది నేరం!" అన్నారు కళ్ళ డాక్టర్లు.

అతను వెళ్తున్నాడు... వెళ్తున్నాడు... వెళ్తున్నాడు...దేశంతోపాటు నడుస్తున్నాడు. అతని వెనగ్గా ఒకడరిచాడు. "ఏయ్.. ఏయ్.. మనిషీ..!"

అతనాగాడు. ఓ కొత్త మనిషి అతని దగ్గరకు వచ్చాడు. చెయ్యి పట్టుకున్నాడు. నవ్వుతూ అడిగాడు "నాతో వస్తావా?"

"ఎక్కడికి?"

"నీకు పది రూపాయలొస్తాయ్.."

"ఎందుకు?"

"చప్పట్లు కొట్టినందుకు.. స్లోగన్స్ పలికినందుకు.."

"ఎందుకూ?"

"దేశానికి విధేయతగా ఉన్నందుకు.."

అతను ఆశ్చర్యంగా అడిగాడు. "నిజంగా, ఈ దేశంలో ఎవరన్నా విధేయులుగా ఉన్నారా?"

"ఎందుకు లేరు? మన నాయకుడు లేడూ?"

"ఆ నాయకుడెవరు?"

"నీకు డబ్బులిచ్చే ఆయన...!"

"ఆయనక్కు ఆ డబ్బు లెక్కణ్ణుంచి వస్తాయి?"

"సరేలే! నీ ప్రశ్నలకు సమాధానాలు చెపుతూ కూచుంటే అయినట్టే.. నువ్వో ఇడియట్ వి!!"

అతనికి అర్థం కాలేదు. "నీకు అర్థం చేసుకునే శక్తి లేనట్టుంది" అన్నారెవరో. వెంటనే అతను చప్పట్లు కొట్టడం మొదలు పెట్టాడు... వంటరిగా నిలబడి... ఎడారిలో వంటరి ఒంటెలా....దిక్కులు చూస్తో... ●

